

శ్రీరామ భక్తుల ప్రత్యేక రైలుకు పచ్చజెండా

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరామచంద్రుడిని దర్శించుకునేందుకు భక్తుల ప్రత్యేక రైలులో బుధవారం బెంగళూరు విశ్వేశ్వర్య రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరి వెళ్ళింది. ఈ ప్రత్యేక రైలుకు కోలారు లోక్‌సభ సభ్యుడు మునిస్వామి పచ్చజెండా చూపారు. విధానపరిషత్ సభ్యుడు కేశవ ప్రసాద్, అయోధ్య రామమందిర దర్శన అభియాన కో కన్వీనర్ జగదీష్ హీరేమని ఈ సందర్భంగా హాజరయ్యారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభమయ్యాక అయోధ్యకు ఇంతవరకు 9 ప్రత్యేక రైళ్ళలో భక్తులు బయల్దేరి వెళ్ళారని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి.

పాక్ జిందాబాద్ నినాదాలపై హోరెత్తిన నిరసనలు

- ప్రతిపక్షాల ఆందోళనతో అట్టుడికిన ఉభయసభలు
- అపరిచిత వ్యక్తిపై కేసు నమోదు



జాతీయ జెండాతో నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ సభ్యుడు సయ్యద్ నాసిర్ హుసేన్‌ను అభినందించేందుకు వచ్చినవారిలో ఒకరు పాకిస్థాన్ జిందాబాద్ అనే నినాదాలు చేయడంపై బుధవారం శాసనసభ, విధాన పరిషత్ అట్టుడికాయి. బీజేపీ, జేడీఎస్ సభ్యులు జాతీయ పతాకాలు చేతబట్టి సభలోకి ప్రవేశించారు. కార్యకలాపాలు ప్రారంభం కాగానే రాష్ట్ర పరిపాలనా కేంద్రం విధానసౌధలోనే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ప్రతిపక్ష సభ్యులు మండిపడ్డారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ కర్ణాటక చరిత్రలోనే ఇటువంటి సంఘటన చోటు చేసుకోలేదన్నారు. విధానసౌధలో వందలాది సమావేశాలు జరిగాయని పేర్కొన్నారు. ఏడు కోట్లమంది కన్నడిగుల ప్రజాస్వామ్య సౌధలో దారుణమైన నినాదాలు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో భయానక పరిస్థితికి ఇదే నిదర్శనమని ఆరోపించారు. దేశ వ్యతిరేక నినాదాలు చేసినవారికి రెడ్‌కార్పెట్‌తో విధానసౌధలోకి తీసుకొచ్చినవారు ఎవరని ప్రశ్నించారు. ఇదే సందర్భంలో వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్ మాట్లాడుతూ పార్లమెంట్‌లోకి దూసుకెళ్లినవారెవరని ప్రశ్నించారు. ఇలా అశోక్, జమీర్ అహ్మద్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పార్లమెంట్‌లోకి దూసుకెళ్లినవారిని క్షణాలలో అరెస్టు చేశారని, వారిపై కేసులు నమోదు చేశారని, ఇప్పటికీ జైల్లోనే ఉన్నారని పేర్కొన్నారు. దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ 500 మంది పోలీసులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండే విధానసౌధలోనే పాకిస్థాన్ జిందాబాద్ అనే నినాదాలు చేసేందుకు ఎంత ధైర్యం ఉండాలన్నారు. నినాదాలు చేసిన వ్యక్తి ని విధానసౌధ నుంచి బయటకు పంపేందుకు వాహనం సమకూర్చినవారు ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన జీసీ చంద్రశేఖర్, బీజేపీ అభ్యర్థి గెలుపొందినప్పుడు ఎలాంటి నినాదాలు లేవన్నారు. సయ్యద్ నాసిర్ గెలుపొందినప్పుడే ఎందుకు ఇలాంటి ఘటనలు జరిగాయని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ యూటీ ఖాదర్ స్పందిస్తూ తీవ్రమైన అంశం చర్చించేవేళ సమైక్యంగా ఉండాలని, రాజకీయాలు వీడాలని, దేశం, దేశభద్రత అంశంలో గంభీరంగా వ్యవహరించాలన్నారు. మరోసారి అశోక్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత బడ్జెట్ సమావేశాల వేళ చెవిలో పూలు పెట్టుకొచ్చారని, మంగళవారం బహిరంగంగా నినాదాలు చేసినా చూడలేదు, వినిపించలేదంటే ఏమని అర్థం చేసుకోవాలన్నారు. శివమొగ్గలో లాంగ్‌లు, కొడవళ్లతో తిరుగుతారని, ఫ్లెక్సీలు వేసుకుంటారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఈ అంశంపై చర్చించాల్సి ఉండేదన్నారు. ఇది దేశానికి జరిగిన అవమానమన్నారు. కన్నడిగులు తలదించుకునే సంఘటన అని, ప్రభుత్వం బాధ్యతలేకుండా వ్యవహరిస్తోందన్నారు. నినాదాలు చేసిన వ్యక్తిని ఎవరు తీసుకొచ్చారో వారికి రాజ్యసభ టిక్కెట్ ఇచ్చారనే వ్యాఖ్యల మేరకు అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ మీరే ఉద్దేశ్యపూర్వకంగా చేసి ఉండవచ్చునని, సమగ్ర దర్యాప్తు అవసరమన్నారు. ఇరు పక్షాల సభ్యులు తీవ్రమైన వాగ్వాదం చేసుకోవడంతో సభతో పది నిమిషాలపాటు వాయిదా వేశారు. మరోసారి సభ ఆరంభమైనా ఇదే పరిస్థితి కొనసాగడంతో గురువారానికి వాయిదా పడింది.



విధానసౌధ వద్ద జాతీయ జెండాలతో ప్రతిపక్ష సభ్యులు



శాసనసభలో నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులు

పరిషత్‌లోనూ..

పరిషత్ కార్యకలాపాలు ప్రారంభం కాగానే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ సభ్యులు ఏకవచనంతో దూషించుకునేంతటి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందుగా ప్రతిపక్ష పార్టీ విప్ రవికుమార్ మాట్లాడుతూ విధానసౌధలో దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వ్యక్తిని గుర్తించకపోవడం దారుణమన్నారు. ఇది రాజ్యాంగానికి జరిగిన అవమానమని, సమాఖ్య వ్యవస్థలో ప్రజా ప్రభుత్వంలో ఉన్నామని, అటువంటి స్థలంలోనే పాకిస్థాన్‌కు జిందాబాద్ అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. అతను ఏమైనా పాక్ ఏజెంటా అంటూ ప్రశ్నించారు. కేజీహళ్లి, డీజే హళ్లిలో పోలీస్ స్టేషన్‌ను కాల్చినవారి కేసులను వాపసు తీసుకుంటారని, పీఎఫ్ఐపై కేసులు రద్దు చేస్తారని అందుకే వారు ధైర్యంతో నినాదాలు చేశారన్నారు. గతంలో ఇలాంటి చర్యలకు వెంటనే తగిన పరిణామాలు ఉండేవన్నారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ సభ్యుడు అబ్దుల్ జబ్బార్, బీజేపీ సభ్యుడు రవికుమార్‌ను ఏకవచనంతో మాట్లాడడంతో ఒకరినొకరు తోసుకునే పరిస్థితి ఏర్పడింది. అధికార పార్టీ సభ్యులు సైతం పోడియం వద్దకు దూసుకొచ్చారు. సభ గందరగోళంగా మారడంతో సభాపతి మార్షల్స్‌ను అప్రమత్తం చేశారు. సభ అదుపు తప్పటడంతో సభాపతి బసవరాజ్ హొరట్టి పది నిమిషాలపాటు వాయిదా వేశారు. దీంతో బీజేపీ సభ్యులు జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ బయటకు వచ్చారు.

విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో కేసు

విధానసౌధ వద్ద దేశ వ్యతిఇరేక నినాదాలు చోటు చేసుకోవడంపై విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో సుమోటోగా కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలోని ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు సెక్షన్ 505(1), (బి), 153బి, సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. విధానసౌధ తూర్పుద్వారం వద్ద కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సయ్యద్ నాసిర్ హుసేన్ విజయోత్సవం జరుపుకొంటున్న వేళ సాయంత్రం 6-6.30 గంటల మధ్య పాకిస్థాన్ జిందాబాద్ అనే నినాదాలు వచ్చిన మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం శాసనసభ ప్రతిపక్ష విప్ దొడ్డనగౌడ పాటిల్, పరిషత్ విప్ రవికుమార్, ఎమ్మెల్యేలు భరత్‌శెట్టి, హరీశ్‌పూంజా, జ్యోతి గణేశ్‌ల బృందం విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేసింది.

హావేరి జిల్లా వాసిగా అనుమానం

విధానసౌధలో దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వ్యక్తి హావేరి జిల్లా బ్యాడగి నివాసిగా బీజేపీ నేతలు ఆరోపించారు. బుధవారం బ్యాడగిలో ఎమ్మెల్యే విరూపక్షాలప్ప నేతృత్వంలో నిరసన తెలిపారు. ఇతడు బ్యాడగిలో మిరప వ్యాపారం చేస్తాడని, ఇతడిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా హోంశాఖ మంత్రి పరమేశ్వర్ సంఘటనపై ఆరా తీసేందుకు ఇంటెలిజెన్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాసనసభలో హోంశాఖ మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ దేశ వ్యతిరేక నినాదాలు చేసినట్టు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సదరు వీడియోలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామన్నారు. హోం మంత్రి మాట్లాడుతుండగానే నాసిర్ హుస్సేన్‌ను వెంటనే అరెస్టు చేయాలని జేడీఎస్ సభ్యులు డిమాండ్ చేయడంతో సభ గందరగోళం కాగా వాయిదా పడింది.

నివేదిక అందిన తక్షణం చర్యలు

- ఎవరినీ రక్షించే ప్రశ్నే లేదు
- రాజకీయ లబ్ధికోసమే బీజేపీ రాద్ధాంతం
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ జిందాబాద్ నినాదాల నిగ్గు తేల్చేందుకు చానళ్లలో ప్రసారమైన కథనాల వీడియో క్లిప్పింగ్‌లు, సీసీటీవీ ఫుటేజీలను ఎఫ్ఎస్ఎల్‌కు అప్పగించామని, నివేదిక అందిన తక్షణం రుజువైతే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. శాసనసభ సమావేశాలు వాయిదా పడిన అనంతరం బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనలో ఎవరినీ రక్షించే ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు. వరుస ఓటములతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనైన బీజేపీ రాజకీయ లబ్ధి కోసమే ఈ అంశంపై రాద్ధాంతం చేస్తోందని సీఎం విరుచుకుపడ్డారు. తప్పు చేసినవారిని రక్షించే ప్రశ్నే లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమ గ్యారెంటీ పథకాలతో బెంబేలెత్తిన బీజేపీ విద్వేష ప్రచారాన్ని ప్రారంభించిందని ధ్వజమెత్తారు. దేశద్రోహులను రక్షిస్తున్నామంటూ బీజేపీ చేసిన ఆరోపణలను ఘాటుగా తిప్పికొట్టిన ఆయన కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నించే నైతికత ఆ పార్టీకి లేదన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా, ఎవరిపైనా చర్యలు తీసుకోవడం సాధ్యపడదన్నారు.


దేశద్రోహులను అరెస్టు చేసేదాకా పోరాటం

తమ పార్టీ దేన్నయినా సహిస్తుందిగానీ దేశద్రోహాన్ని సహించబోదని ప్రతిపక్షనేత ఆర్. అశోక్ స్పష్టం చేశారు. శాసనసభ లాంజ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటన జరిగి 24 గంటలు గడిచినా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యవహారంపై మీడియా మొత్తం కోడై కూస్తోందని, ఈ ఘటనతో అంతర్జాతీయస్థాయిలో కర్ణాటక విధానసౌధ ప్రతిష్ఠ మంటగలిసిందన్నారు. దేశద్రోహ నినాదాలకు నిరసనగా తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిరసనలు జరిపామని గురువారం కూడా కొనసాగుతాయన్నారు. గవర్నర్‌ను కలసి ఈ అంశంపై ఫిర్యాదు చేస్తామని, ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాల్సిందిగా కోరుతామన్నారు. దేశద్రోహ నినాదాలకు సాక్షిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుసేన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను తక్షణం అరెస్టు చేయాలని అశోక్ డిమాండ్ చేశారు.

వారికి భారత్‌లో నివసించే హక్కులేదు

- శ్రీరామ సేన అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో ఉంటూ ఇక్కడి గాలి పీలిస్తూ, నీరు తాగుతూ పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న దేశద్రోహులను ఏరిపారేయాలని శ్రీరామసేన డిమాండ్ చేసింది. శ్రీరామసేన జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ ఈ మేరకు నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు విధానసౌధలో పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేసిన వారిని ఆ దేశానికి పంపించేస్తే మంచిదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. దేశద్రోహులకు ఊతమిచ్చేవారిని కూడా ఉపేక్షించరాదన్నారు. విధానసౌధలో జరిగిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, వారికి ప్రభుత్వం నుంచి ఏమైనా సదుపాయాలు అందుతూంటే తక్షణం వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.



ఎంపీ నాసిర్ కార్యాలయం ముట్టడి

- బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- బీజేపీ ఉద్దేశపూర్వకంగానే చేస్తోంది : ఎంపీ నాసిర్ హుసేన్



ఎంపీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న బీజేపీ కార్యకర్తలు

బళ్లారి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) సయ్యద్ నాసిర్ హుసేన్‌కు వ్యతిరేకంగా బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం ఆయనకు చెందిన కార్యాలయాన్ని కార్యకర్తలు ముట్టడించారు. సుమారు వంద మందికి పైగా బీజేపీ కార్యకర్తలు వచ్చి బళ్లారిలోని బుడా కార్యాలయంలో ఉన్న ఎంపీ కార్యాలయాన్ని ముట్టడించి ఆయన పేరుతో ఉన్న నేమ్ బోర్డును తొలగించారు. రాజ్యసభ సభ్యుడిగా నాసిర్ హుసేన్ కాంగ్రెస్ పార్టీ నుంచి మంగళవారం జరిగిన ఎన్నికల్లో గెలిచారు. బెంగళూరులో విధానసౌధ వద్ద ఆయన వెంట ఉన్న కొందరు పాకిస్థాన్ జిందాబాద్ అన్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. నాసిర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి బీజేపీ కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ తతంగమంతా బళ్లారిలో రెండు గంటల పాటు జరిగింది.

బీజేపీ రాజకీయ డ్రామా: ఎంపీ నాసిర్

ఇదంతా బీజేపీ ఆడుతున్న రాజకీయ డ్రామా అని రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుసేన్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపైనా, యూట్యూబర్‌పైనా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన అనంతరం పలు చానళ్లతో మాట్లాడానని తెలిపారు. చివరిలో ఒక యూట్యూబర్ వచ్చాడని, అతడి వెంట కొందరు ఉన్నారని వివరించారు. వారి నుంచే పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేయించారని తెలిపారు. తమది స్వతంత్ర పోరాట కుటుంబమని, తన తాతలు, తండ్రి అందరూ స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకురని చెప్పారు. ఒక యూట్యూబర్‌తో బీజేపీ ఆడించిన రాజకీయ డ్రామా అన్నారు. ఇందుకు సంబంధించి వీడియో క్లిప్పింగులు కూడా ఉన్నాయని, అవి పోలీసులకు ఇచ్చానని తెలిపారు. సమాజంలో మతతత్వాన్ని ప్రేరేపించి అశాంతికి పూనుకునే ఇలాంటి సంఘ వ్యతిరేక వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బెంగళూరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీ తెలిపారు.



మోతీ సర్కిల్లో నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలు

విద్యుత్‌చార్జీల తగ్గింపు

- మార్చి 1 నుంచి అమలు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది.



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. కర్ణాటక విద్యుచ్ఛక్తి నియంత్రణా కమిషన్ (కేఈఆర్‌సీ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. వంద యూనిట్లకంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించేవారికి ప్రతి యూనిట్‌పై రూ.1.10 పైసల చొప్పున తగ్గించారు. వాణిజ్య వినియోగదారులకు రూ.1.25 పైసలు తగ్గించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలకు యూనిట్‌కు 40 పైసలు తగ్గించారు. ప్రైవేట్ ఎత్తిపోతల వినియోగదారులకు యూనిట్‌పై ఏకంగా రూ.2 తగ్గించారు. మార్చి 1నుంచి నూతన విద్యుత్‌చార్జీలు అమలులోకి వస్తాయని కేఈఆర్‌సీ ప్రకటనలో పేర్కొంది. విద్యుత్‌చార్జీల తగ్గింపు నిర్ణయాన్ని కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య స్వాగతించింది. సమాఖ్య నగరంలో ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ చార్జీల తగ్గింపు పారిశ్రామిక రంగ ప్రగతికి ఊతమిస్తుందని, చిన్న పరిశ్రమలకు ఊరట కలిగిస్తుందని పేర్కొంది.



మీడియాతో శివరాం హెబ్బార్

అనారోగ్యంతోనే ఓటు వేయలేదు

- బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్


బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణాలవల్లే రాజ్యసభకు మంగళవారం జరిగిన పోలింగ్‌లో తాను పాల్గొనలేకపోయానని బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ వెల్లడించారు. యల్లాపురలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటు వేయలేకపోవడం ఎంతో బాధగా ఉందన్నారు. తన ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించిందని, వైద్యుల సూచన మేరకు ఆసుపత్రిలో చేరానని వివరించారు. బీజేపీని వీడే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. బీజేపీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచానని, ఈ పార్టీలోనే ఉంటూ ప్రజాసేవ చేస్తానని స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పనిచేసినవారిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తాను ఒకింత అసంతృప్తితో ఉన్న మాట నిజమేనన్నారు. రాష్ట్ర నేతలపైగానీ, జాతీయ నేతలపైగానీ ఎలాంటి అసంతృప్తి లేదన్నారు. ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయనున్నట్టు వినిపిస్తున్న వదంతులను ఆయన ఖండించారు. అలాంటిదేమైనా ఉంటే మీడియా ముందుకు తప్పక వస్తానని తెలిపారు.

బిట్‌కాయిన్ కేసులో మరో ఇన్‌స్పెక్టర్ అరెస్టు

- డీఎస్పీ పరారీ

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్ వివాదంపై దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంతయ్యను అరెస్టు చేశారు. బుధవారం ఉదయం పక్కా పథకం ప్రకారం అధికారుల బృందం దాడి చేసి అరెస్టు చేసినట్లు ప్రకటించారు. గతంలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంతయ్య బిట్ కాయిన్ కేసు విచారణాధికారిగా వ్యవహరించారు. ఇదే కేసులో ప్రముఖ నిందితుడిగా ఉండే డీఎస్పీ శ్రీధర్ పూజార్‌ను అధికారులు అరెస్టు చేసేందుకు వెళ్లగా పోలీసు కారుకు వాహనంతో ఢీకొట్టి పరారయ్యారు. కాఫీబోర్డు సిగ్నల్ వద్ద డీఎస్పీ వస్తున్నారనే సమాచారంతో సిట్ అధికారుల బృందంలోని అనిల్‌తో పాటు పలువురు సిబ్బంది అరెస్టు చేసేందుకు వెళ్లారు. పోలీసులు అడ్డుకునేందుకు వస్తున్నారని గమనించి వాహనంతో ఢీకొట్టి పరారయ్యారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీధర్‌పూజార్‌పై 307, 353 సెక్షన్ల కింద విధానసౌధ పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా డీఎస్పీ శ్రీధర్‌పూజార్ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించి తప్పించుకు తిరుగుతున్నారు. అంతలోనే అరెస్టు చేసేందుకు అధికారులు సిద్ధం కాగా మరోసారి తప్పించుకున్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.90	1,605.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	893	8,047
సామర్థ్యం (టీఎంసీలు)	8.63	29.11

ఎస్‌జేఆర్‌హెచ్‌పీ స్కూల్లో సైన్స్ ప్రదర్శన



నమూనా గురించి వివరిస్తున్న విద్యార్థులు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 28: పీడీ హళ్లి గ్రామంలోని ఎస్‌జేఆర్‌హెచ్‌పి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీనారాయణప్ప, కరెస్పాండెంట్ చంద్రమూర్తిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందర్శకులకు సైన్స్ గురించి పలు నమూనాల గురించి వివరించారు. సైన్స్ ఎగ్జిబిషన్ సందర్భంగా చిన్నారులు పలు యంత్రాలు, వ్యవసాయం, సేంద్రీయ ఎరువులు, మానవుడి గుండె పనిచేయు విధానం, మనిషిలో రక్తప్రసరణ వ్యవస్థ తదితరాలను నమూనాలతో వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ చంద్రమూర్తి, హెచ్‌ఎం మహేష్ కుమార్, ఉపాధ్యాయులు రాజన్న, చంద్రశేఖర్, గాయత్రి, పల్లవి, జ్యోతి, చైత్ర, జాస్మి, విజయలక్ష్మి, సుమిత్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమృతేశ్వర ఆలయంలో విశేష పూజలు



పూజలు చేస్తున్న పీఠాధిపతి

బళ్లారి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బళ్లారి సమీపంలోని బాలాజీ నగర్ క్యాంపులోఅత్యంత విశేషంగా నిర్మించిన అమృతేశ్వర దేవాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. బుధవారం రుద్ర పారాయణం, మహామంగళారతి, ప్రసాద వినియోగం జరిగాయి. వారాణి సినిమా ప్రొడ్యూసర్ కొర్రపాటి సాయి, ఆయన కుటుంబీకులు, ఇక్కడి భక్తుల సహకారంతో అమృతేశ్వర ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో బాగంగా ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకూ వివిధ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి పూజల్లో పాల్గొంటున్నారు.

రెవెన్యూ పరిధిలోకి తండా గ్రామం

సిరుగుప్ప, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం సిరుగుప్ప తాలూకాలోని తాండా గ్రామాన్ని ఈ ఏడాది రెవెన్యూ గ్రామంగా ప్రకటించిందని, దీంతో ఆ గ్రామాన్ని రెవెన్యూ పరిధిలో చేర్చినట్లు తహసీల్దార్ షంషాలం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించి, అక్కడ రెవెన్యూ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. గ్రామంలోని ప్రైవేటు,ప్రభుత్వ భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా టెక్కలకోట ఆర్ఐ సురేష్ బాబు, పాలనాధికారి గిరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడిగా శివకుమార్

కంప్లి, ఫిబ్రవరి 28: బళ్లారి జిల్లా జేడీఎస్ పార్టీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడిగా కుడితిని పట్టణానికి చెందిన భావి శివకుమార్‌ను నియమించారు. ఈయనకు జేడీఎస్ పార్టీ అభివృద్ధికు నాంది పలకడంతో వారిని గుర్తించి రాష్ట్ర కార్మిక విభాగ అధ్యక్షుడు రామయ్య ఆదేశించడంతో జిల్లా నూతన అధ్యక్షులు తాయన్న, సండూరు తాలుకా అధ్యక్షులు సోమన్నలు ఆయనకు అర్హత పత్రం అందించారు. తనపై నమ్మకం వుంచి తనకు కార్మిక విభాగం అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు.లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో జేడీఎస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు నాంది పలుకుతామని తెలిపారు.

సైన్స్‌తో జీవితం సుఖమయం

జాతీయ సైన్స్ దినోత్సవంలో డాక్టర్ నాగభూషణ్



వ్యాసరచన పోటీల విజేతకు ప్రశంసాపత్రం అందిస్తున్నడాక్టర్ నాగభూషణ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 28: సైన్స్ నేడు అసాధ్యాలను సుసాధ్యం చేస్తోందని, జీవితాన్ని సుఖమయం చేస్తుందని విశ్రాంత ఆచార్యులు డాక్టర్. నాగభూషణ్ అన్నారు. నగరంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కేంద్ర, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, జిల్లా పాలనా యంత్రాంగం, జిల్లాపంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం-2024ను సివిరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశాన్ని సైన్స్‌లో శిఖరాగ్రానికి తీసుకెళ్ళిన సర్ సీవీరామన్ అసాధారణ విజయాలను స్మరించుకోవడానికి జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించడంలో, అభివృద్ధి చేయడంలో ఆయన సాధించిన విజయాలు, ఆయన పాత్ర ఎంతో పెద్దదో గుర్తించుకోవాలని అన్నారు. కోవిడ్-19తో బాధపడుతున్న రోగులకు వ్యాక్సీనేషన్ ఇచ్చి విదేశాలకు సరఫరా చేయడంలో మనదేశ శాస్త్రవేత్తలు గొప్ప విజయం సాధించారని, అదేవిధంగా చంద్రయాన్-3 ప్రయోగంలో ఇస్రో మహిళా శాస్త్రవేత్తల పాత్ర కీలకమని చెప్పారు. బళ్లారిలో వైజ్ఞానిక కేంద్రాన్ని ప్రారంభించేందుకు తన వంతు సేవ చేస్తానని సైన్స్ మెటీరియల్‌ప్రదర్శనతో చిన్నారులకు ఎంతోమేలు జరుగుతుందన్నారు.

జిల్లాపంచాయతీ ముఖ్య ప్రణాళిక అధికారి వగీశ శివాచార్యులు మాట్లాడుతూ.. సైన్స్ అనేది ఆసక్తికర అంశమని, నిరంతర కృషి ఉంటే సైన్స్‌లో ఏదైనా సాధించవచ్చన్నారు. కిష్కింధ యూనివర్శిటీ డీన్ మంజునాథ్ మాట్లాడుతూ సైన్స్‌లోని వివిధ రంగాల్లో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం కాంతి, ధ్వని తరంగాల గురించి ఉదాహరణాలతో వివరించారు. ఆకాశం, సముద్రం నీలంగా మారడానికి కారణమేమిటో ఆయన వివరణ ఇచ్చారు. రంగుల ప్రాముఖ్యత గురించి చెప్పారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లాపంచాయతీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి సహా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో సమస్యలపై అవగాహన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 28: ఐసీఏఐకి చెందిన బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థ, బళ్లారి శాఖ ప్రాంగణంలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఏఈ)కు చెందిన సమస్యల పరిష్కారంపై బుధవారం అవగాహన శిబిరం జరిగింది. జిల్లావాణిజ్య పరిశ్రమల సంస్థ అధ్యక్షుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఏ రాజేశ్ బాగ్రేచ్

బి.మహారుద్రగౌడ మాట్లాడుతూ 43బిహెచ్, ఆదాయపు పన్ను నెలవారీ ఖాతాల సెటిల్‌మెంట్, ఎన్నికల సమయంలో నగదు నిర్వహణ, రవాణా తదితర అంశాలపై నిపుణులు సమాచారం అందజేస్తారని తెలిపారు. సీఐటీజీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ, జిల్లాపారిశ్రామిక కేంద్రం, కాసియా సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 1వ తేది సోమవారం రాయల్‌పోర్ట్ హాల్లో లాభాలు, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీనియర్ ఉపాధ్యక్షుడు యశవత్‌రాజ్ నాగిరెడ్డి తెలిపారు. సూక్ష్మ, చిన్నపరిశ్రమలకు సహాయం ఎగుమతులు, సీఏ రాజేశ్ బాగ్రేచ్ 43బిహెచ్, ఎంఎస్‌ఏఏసీ చెల్లింపులో జాప్యం జరిగితే అనుసరించాల్సిన విధానాలపై ఉపన్యాసం ఇచ్చారు. శ్రీధర పార్థసారథి మార్చి నెలాఖరున అకౌంట్స్ బుక్స్ ఎలా క్లోజ్ చేయాలనే అంశంపై అసక్తికర ఉపన్యాసం ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి విధానం పాటించాలి. ఎలాంటి విధానం పాటించకూడదు అనే అంశంపై సీఏకే రాజశేఖర్‌రావు ఉపన్యాసమిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దొడ్డనగౌడ, సొంతగిరిధర్, సంయుక్తకార్యదర్శులు మర్చుడ్ మల్లికార్జునగౌడ, రామచంద్ర, కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక సమన్వయ కమిటీ సభ్యులు,రైస్‌మిల్లు అసోషియేషన్, ఏపీఎంసీ నిర్వాహకులు,పారిశ్రామిక సంఘం, స్పాంజ్‌ఐరన్ అసోసియేషన్, గార్మెంట్ అసోషియేషన్, కోల్డ్‌స్టోరేజ్ అసోషియేషన్, ఇతర సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్‌యూసీఐ ఆందోళన

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 28: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగెత్తి పోతున్నారని ఎస్‌యూసీఐ ఆరోపించింది. ప్రజల సంక్షేమంలో ఇరు ప్రభుత్వం ఇరు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొంది. ఈ సందర్భంలో సోషలిస్ట్ యునిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ) నగరంలో బృహత్ ఆందోళన నిర్వహించింది. కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించిన ఎస్‌యూసీఐ జిల్లా



ఆందోళన చేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

కార్యదర్శి రాధాకృష్ణ ఉపాధ్యాయ మాట్లాడుతూ.. దేశంలో ఐదు సంవత్సరాలకొక సారి జరిగే ఎన్నికల్లో పోటీచేసిన నాయకులు పెద్ద పెద్ద వాగ్దానాలతో ప్రణాళికలు తయారు చేస్తున్నా... అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టడంలో పూర్తి విఫలమవుతున్నారని ఆరోపించారు. ప్రపంచంలో భారత దేశం ఆకలి బాధలో 111వ స్థానంలో ఉందన్నారు. దేశంలో 77 శాతం సంపద 10మంది శ్రీమంతుల చేతిలో ఉన్నట్లు సర్వే నివేదికలు తెలుపుతున్నాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పార్టీ కార్పొరేట్ సంస్థలకు రెడ్‌కార్పెట్ వేస్తుండడం విచారించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఎస్‌యుసిఐ జిల్లా సమితి సభ్యులు దేవదాస్ మాట్లాడుతూ.. ప్రజలు అవసరమైన తాగునీటికోసం అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. పండించిన పంటలు చేతిక అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. కర్షకులు, కార్మికులు ఐకమత్యంతో తమతో చేతులు కలిపి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సమితి అధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్, ఎస్‌యుసిఐ జిల్లా సమితి సభ్యులు నాగలక్ష్మి, సోమశేఖర్ గౌడ, శాంత, గోవింద పదాధికారులు నాగరత్న, పంపాపతి, కోళూరు హనుమప్ప, ఈశ్వరి పాల్గొన్నారు.

పరిపూర్ణమైన పరిజ్ఞానంతోనే పరిశోధనలు

● వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 28: వివిధ విభాగాల్లో పరిపూర్ణమైన పరిజ్ఞానం ఉన్నపుడే పరిశోధనలు పూర్తి చేయడం సాధ్యమని గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయంలో 'సమాజ విజ్ఞానంలో పరిశోధనలు' అనే విషయానికి సంబంధించి బుధవారం జరిగిన అంతర్జాతీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు నిరంతరం క్రమశిక్షణతో పనిచేయాలని అపుడే దేశాభివృద్ధికి అవసరమైన విజ్ఞానాన్ని అందించడానికి సాధ్యమవు తుందన్నారు. అనంతరం కొడుగు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ అశోక్ ఆలూర్ మాట్లాడుతూ, పరిశోధనలు సమాజాభివృద్ధికి ఉపయోగ పడేలా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ అనంత ఎల్.ఝుండేకర్ పరిశోధనల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ

విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.రుద్రేష్, మౌల్యమాప విభాగం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ ఓలేకార్, ప్రొఫెసర్ సద్యోజాదప్ప, సమ్మేళనం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గౌరి మాణిక్‌మానస, ప్రొఫెసర్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఇండో అమెరికన్ కాలేజీలో రాజ్యాంగ జాతా



జాతాలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 28: నగరంలోని ఇండోఅమెరికన్ కళాశాలలో బళ్లారి అడ్మినిస్ట్రేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సలీంభాష తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వేదికపై కూర్చున్న అతిథులు భారత రాజ్యాంగం, అంబేద్కర్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం, అంబేద్కర్‌పై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం వేదికపై ఉన్న అధికారులు విద్యార్థులందరికీ రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాజ్యాంగ జనజాగృతికి రూ.లక్ష నగదు బహుమతి

సిరుగుప్ప, ఫిబ్రవరి 28 : రాజ్యాంగ రచనపై జనజాగృతి కార్యక్రమం విజయవంతం కావడంతో సిరుగుప్ప తాలుకా సాంఘిక సంక్షేమ శాఖకు రూ.లక్ష నగదు బహుమతిని అందజేసినట్లు తాలుకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు. సిరుగుప్ప తాలుకాలో ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు రాజ్యాంగంలో రచించిన విషయాలను ప్రజలకు తెలియపరిచేందుకు జనజాగృతి ర్యాలీ చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలుకాకు ప్రథమ బహుమతిని అందజేసింది.

మానవత్వం చాటుకున్న స్నేహితులు



జోసఫ్ కుమార్ కుటుంబం ఖాతాలో రూ.లక్ష జమచేసిన స్నేహితులు

కంప్లి, ఫిబ్రవరి 28 : జీవితంలో తల్లిదండ్రులు ఎలా ముఖ్యమో స్నేహితులు కూడా అంతే ముఖ్యం. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కొన్ని సందర్భాల్లో స్నేహితులు మాత్రం అన్నింటిని ఎదుర్కొని తోడుగా నిలబడతారు. జనవరి 6న కేపీసీఎల్‌లో కాంట్రాక్ట్‌పై విధులు నిర్వహిస్తున్న జోసఫ్ కుమార్ (31) గుండెపోటుతో మృతి చెందాడు. అతడు తోటి స్నేహితులతో ఎంతో ఆనందంగా ఒక కుటుంబంగా వుండేవాడు. అతను అకాల మరణం చెందడంతో స్నేహితులకు కూడా దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. బుధవారం శ్రీనివాస్, నరసింహ, షెక్షావలీ, మెత్రి అమరేష్, అశోక్, గోవింద, ఉదయ్‌లు ముందుకొచ్చి తమ స్నేహితుని కుమార్తె పేరు మీద కుడితిని ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ చేశారు. మొత్తానికి అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకుని మంచి స్నేహితులుగా గుర్తింపు పొందారు.

ఏళుబెంచి గ్రామంలో ఎక్కడ చూసినా కంపే



చెరువు పక్కనే వేసిన చెత్తాచెదారం

కంప్లి, ఫిబ్రవరి 28 : కురుగోడు తాలుకా పరిధిలోని ఏళుబెంచి గ్రామంలో ఏ వార్డులో చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌లో ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నా ఏళుబెంచికి మాత్రం అక్కడి గ్రామ పంచాయతీ అధికారులు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నోసార్లు ప్రధాన వీధుల్లో వుండే చెత్తాచెదారాన్ని తొలగించాలని పీడీవోకు తెలిపినా వారికి చీమకుట్టినట్లు కూడా లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఆయన గ్రామానికి వారానికి రెండు సార్లు మాత్రమే వస్తుంటారు. గ్రామంలో విషయాలు తెలియజేసేందుకు గ్రామపంచాయతీకి వెళ్లినా మీటింగ్‌ల్లో, విధుల్లో వుంటున్నామని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కుంటలు, చెత్తాచెదారం వల్ల దోమలు అధికమై చికన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారముంది. ఇప్పటికే స్థానిక ఉప కేంద్రాల వైద్యులకు కూడా ఈ విషయంపైన మనవిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా మురుగు కాలువలను పరిశుభ్రం చేసి తమను రోగాల బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

రాయచూరు, ఫిబ్రవరి 28 : రాష్ట్రం నుంచి అక్రమంగా తరలివెళుతున్న మద్యాన్ని బుధవారం యరగేరా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాయచూరు -కర్నూల్ అంతరాష్ట్ర రహదారిపై ఉన్న చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా వెళుతున్న వాహనాన్ని గుర్తించి తనిఖీ చేసిన పోలీసులు అందులో రూ.1.93 లక్షల 458 లీటర్‌ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. యరగేరా సబ్‌ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా నుంచి ఏపీకి వెళుతున్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు.




మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

హోసూరు జోన్

ఇంటర్నేషనల్ కాల్స్ డొమెస్టిక్‌గా మార్చి.. మోసం

హోసూరు(క్రైం), ఫిబ్రవరి 28: నేషనల్,ఇంటర్నేషనల్ కాల్స్‌ను ఇంటర్నెట్ సాయంతో డొమెస్టిక్ కాల్స్‌గా మార్చి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ఇద్దరు యువకులను హోసూరు నగర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌లు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమెరికా, ఫిలిపిన్స్, సౌదీ అరేబియా వంటి విదేశాల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను అక్రమంగా ఇంటర్నెట్‌లో ఎక్కువసేపు మాట్లాడగలిగే డొమెస్టిక్ కాల్స్‌గా మార్చారని పోలీసులు తెలిపారు. చెన్నైలో టెలికమ్యూనికేషన్ సెక్యూరిటీ డైరెక్టర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హోసూరులో నిందితులను గుర్తించామన్నారు. హోసూరు నగర ఇన్‌స్పెక్టర్ శివకుమార్





పట్టుబడిన నిందితులు

నేతృత్వంలో కేజీబీ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సాకుల్ అమీదు(26), అరుణాచలం (24)లను అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారన్నారు. కాగా ఇందుకు సూత్రధారిగా భావిస్తున్న కేరళకు చెందిన మరో వ్యక్తి కోసం గాలింపులు చేపట్టామని సీఐ శివకుమార్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

హోసూరు(సిఫ్‌కాట్) ఫిబ్రవరి 28: హోసూరు నగరపాలక సంస్థ, మిత్ర లీలా హాస్పిటల్, తమిళనాడు కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం కృష్ణగిరి జిల్లా, మిత్ర లీలా హాస్పిటల్ తరపున బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేలు అధ్యక్షత వహించారు. జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు షానవాజ్, మున్సిపల్ అధ్యక్షుడు జై ఆనంద్ తదితరులు నాయకత్వం వహించారు. శిబిరంలో పిల్లలకు గుండె పరీక్షలు, జనరల్ హెల్త్ మెడిసిన్, పరీక్షలతో పాటు ఉచిత సలహా సూచనలు అందజేశారు. కృష్ణగిరి జిల్లాకు చెందిన కేబుల్ టీవీ ఆపరేటర్లు వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

వంటశాల ప్రారంభం

హోసూరు, ఫిబ్రవరి 28: హోసూరు ప్రాథమిక పాఠశాలలో ప్రైవేట్ సంస్థ సీఎస్‌ఆర్ రూ.19.50 లక్షలతో నిర్మించిన వంటశాల, భోజనశాల భవనాన్ని మేయర్ సత్య ప్రారంభించారు. బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జోనల్ కమిటీ ఛైర్మెన్ రవి, 17వ పార్లమెంట్ సభ్యుడు నాగరాజ్, రఘు, హరిప్రసాద్, దినేశ్, అన్నామలై, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై కాంగ్రెస్ నిరసన

హోసూరు, ఫిబ్రవరి 28: తమిళనాడు మత్స్యకారులను సింహళ నావికాదళం అరెస్టు చేసినా కేంద్రప్రభుత్వం విదేశీ వ్యవహారాలశాఖ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై బుధవారం నల్లజెండాలతో నిరసన తెలిపారు. మత్స్యకారులకు చేపలు పట్టుకోవడం హక్కు అన్నారు. కృష్ణగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మురళీధరన్ ఆధ్వర్యంలో హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం ఎదుట నల్లజెండాల ప్రదర్శన నిర్వహించారు. నిరసనలో కాంగ్రెస్ సభ్యులు వీరమనిరాజ్, కీర్తి గణేశ్, త్యాగరాజ్, అబ్దుల్‌రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



నల్ల జెండాలతో కాంగ్రెస్ నిరసన

విజ్ఞాన శాస్త్రంలో విప్లవాత్మక పురోగతి



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ బీజీ మూలిమని

రాయచూరు, ఫిబ్రవరి 28 : ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు విజ్ఞాన శాస్త్ర పురోగతిని విప్లవాత్మకంగా మార్చివేశాయని కలబుర్గి విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజీ మూలిమని అన్నారు. నగరంలోని యరగేరా రోడ్డు వద్ద ఉన్న రాయచూరు విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి సైన్స్ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బీజీ మూలిమని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు విజ్ఞాన శాస్త్రానికి కొత్త పురోగతిని సంతరించిపెట్టాయన్నారు. కలబుర్గి విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద్ మాట్లాడుతు భారతీయ జ్ఞానకోశాగారంతో పాటు అంతర్ విషయాల్లో పరిశోధనలు చేసే అవకాశం విజ్ఞాన శాస్త్రం మనకు అందించిందన్నారు. విజ్ఞాన శాస్త్రంతో పాటు వైద్య, సాంకేతిక, వ్యవసాయ, సామాజిక రంగాల్లో సహితం పరిశోధనల ద్వార పురోగతి సాధించే అవకాశం సైన్స్ ద్వారానే సాధ్యపడుతుందన్నారు. రాయచూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ హరీశ్ రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉపకులపతి కేఎస్ సైదాపుర, ప్రొఫెసర్ శశిధర్ కేఎస్ తదితరులు పాల్గొన్నారు.


రేపటి నుంచి కృష్ణానది వంతెనపై వాహన రాకపోకలు : ఎంపీ నాయక్

రాయచూరు, ఫిబ్రవరి 28: జిల్లా సరిహద్దులోని కృష్ణానదిపై ఉన్న రోడ్డు వంతెనపై మార్చి 1వ తేదీ నుంచి రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు రాయచూరు ఎంపీ రాజాఅమరేశ్వర్ నాయక్ బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. 45 రోజులుగా మరమ్మతుల కారణంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో హైదరా బాద్‌వైపు వెళ్లే వాహనదారులకు తీవ్రఅసౌకర్యం ఏర్పడినట్లు ఎంపీ తెలిపారు. మరమ్మత్తులు పూర్తైన నేపధ్యంలో మార్చి నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు అధికారులు తెలిపారన్నారు. కాగా పాత వంతెన పక్కలోనే 167వ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి కొత్త వంతెన నిర్మిస్తున్న నేపద్యంలో అప్పటి వరకు ఇదే వంతెనపై రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. దీనిపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రుక్మిణీదేవి అరండేల్ (జయంతి)



రుక్మిణీదేవి అరండేల్ 1904 ఫిబ్రవరి 29న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. చెన్నైలో పేరొందిన కళాక్షేత్ర నాట్య పాఠశాల వ్యవ స్థాపకురాలు. నృత్య కళాకారిణి అయిన ఆమె కర్ణాటక సంగీతం, బాలే, భరతనాట్యాలలో ప్రావీణ్యం పొందారు. భరతనాట్య శిక్షణ కొరకు పాఠశాలను స్థాపించి భరతనాట్య ప్రాచుర్యం, గౌరవాన్ని ఇనుమడింప చేశారు. తన అభిరుచులు, ఏకీభవించిన బ్రిటీష్ దేశానికి చెందిన అరండేల్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. తన తొలి నాట్య ప్రదర్శనను థియోసఫికల్ సొసైటీ వజ్రోత్సవాలలో 20 వేల మందికిపైగా ప్రేక్షకుల ఎదుట చేసి ప్రశంసలు అందుకుంది. అనంతరం ఐర్లాండ్ కవి జేమ్స్ కజిన్స్ ప్రోత్సాహంతో నాట్య పాఠశాల ఏర్పాటు చేసింది. రాజ్యసభ సభ్యురాలిగా రెండు పర్యాయాలు కొనసాగారు. పద్మభూషణ్, శాంతినికేతన్‌చే 'దేశికోత్తమ' పురస్కారం అందుకున్నారు. 1986 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

» నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ పిలుపు

హెబ్బాళ, ఫిబ్రవరి 28: ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న శక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మి, అన్నభాగ్య, యువనిధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నగరాభివృద్ధి మంత్రి బైరతి సురేశ్ పిలుపునిచ్చారు. హెబ్బాళ నియోజకవర్గంలోని ఆర్‌టీ నగర్ హెచ్ఎంటీ మైదానంలో బుధవారం ఏర్పాటైన జనస్పందన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2023 శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలకు అనుగుణంగా అధికారంలోకి వచ్చాక పథకాలు అమలు చేసినట్టు తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో రూ.52వేల కోట్లు కేటాయించారన్నారు. కాగా హెబ్బాళ నియోజకవర్గ పరిధిలో నీటి సమస్య నివారణకు 8 ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలం ముగిసేదాకా కొనసాగిస్తామన్నారు. అవసరమైన చోట్ల సీసీ రోడ్లు వేశామన్నారు. కాగా డ్రైనేజీ మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయని, నాసిరకంగా గుర్తిస్తే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. రేషన్‌కార్డు లేకపోవడంతో గృహలక్ష్మి పథకం రాలేదని కొందరు మంత్రి దృష్టికి తేగా ఇందుకు త్వరలోనే ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. జనస్పందనలో రెవెన్యూ, బెస్కాం, బీబీఎంపీ, ఆహార, ఆరోగ్య, బెంగళూరు వన్, జలమండలి తదితర శాఖలకు సంబంధించి వేర్వేరు కౌంటర్‌లు ఏర్పాటు చేసి సుమారు 1073 అర్జీలను స్వీకరించారు. అన్ని వార్డులకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల మండలి అధ్యక్షుడు రామప్రసాద్, బీబీ ఎంపీ ప్రాంతీయ కమిషనర్ ఆర్ స్నేహాల్, జాయింట్ కమిషనర్ పల్లవి, డీసీపీ సైదుల్ అతావత్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్, ఆరోగ్య అధికారి సవితా, బెస్కాం ఈఈ చంద్రశేఖర్ తది తరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను ఆలకిస్తున్న మంత్రి బైరతి సురేశ్

ఇథియోపియా చిన్నారులకు జయదేవలో గుండె ఆపరేషన్లు



గుండె ఆపరేషన్లు చేయించుకున్న ఇథియోపియా దేశ చిన్నారులతో జయదేవ ఆసుపత్రి ముఖ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇథియోపియా దేశానికి చెందిన ఐదుగురు చిన్నారులకు జయదేవ కార్డియాలజీ ఆసుపత్రిలో ఆపరేషన్‌లు చేశారు. ఇటీవల కొన్నినెలలుగా ఇథియోపియా దేశంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు సరైన వైద్యం అందకపోవడంతో బెంగళూరు జయదేవ ఆసుపత్రికి వచ్చారు. వీరిలో 14 ఏళ్ల ఇబ్సా, 12 ఏళ్ల మేరిమ్‌శాఫీ ఎనిమిదేళ్ల ఎమండా ఎంటిసెనెట్, ఆరేళ్ల అమినాదాబ్ అలెము, 16 ఏళ్ల అయూబ్ అబ్దురేబ్‌ల ఆపరేషన్‌లు చేయించుకున్నవారిలో ఉన్నారు. జయదేవ కార్డియాలజీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ సాధారణంగా ప్రతి వేయిమందిలో ఏడెనిమిది మంది చిన్నారులకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు ఉంటాయని గుండెకు రంధ్రాలు, కవాటాలు దెబ్బతినడం వంటి సమస్యలతో బాధపడుతుంటారన్నారు. 2024 జనవరి 31న ఇథియోపియా దేశానికి చెందిన ఐదుగురు చిన్నారులు శస్త్రచికిత్సలకు వచ్చారన్నారు. వీరినుంచి రాయితీ ఫీజు వసూలు చేశామన్నారు. రోటరీ మిడ్ టౌన్ బెంగళూరు. రోటరీ నీడీ హార్ట్ ఫౌండేషన్‌లు సాయం చేశాయన్నారు. డాక్టర్ పీకే సునిల్, డాక్టర్ దివ్యా, డాక్టర్ రశ్మిల నేతృత్వంలో ఆపరేషన్‌లు చేశామన్నారు.

శాస్త్రీయ భావాలు పెంపొందించుకోవాలి




సైన్స్ వస్తు ప్రదర్శన ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, ఫిబ్రవరి 28: బాల్యం నుంచే శాస్త్రీయ భావాలు పెంపొందించుకోవడం ద్వారా సైన్స్ పట్ల ఆకర్షితులై గొప్ప ప్రయోజకులుగా, సైంటిస్ట్‌గా రాణించే అవకాశం ఉందని రీసోర్స్‌సెంటర్ మంజునాథ్ అభి ప్రాయపడ్డారు. పట్టణంలోని పీఎంశ్రీ స్కూల్‌లో బుధ వారం ఏర్పాటైన సైన్స్‌డేలో పాల్గొని మాట్లాడారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠాలను నేర్చు కోవడంలో అవసరమైన మేరకు ప్రశ్నించే తత్వం అల వరచుకోవాలన్నారు. పిల్లల్లోని క్రియాశీలతను పెంచే దిశలో విజ్ఞాన వస్తు ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్ హనుమంతరెడ్డి మాట్లా డుతూ సులభమైన సైన్స్ ప్రయోగాల ద్వారా పాఠాలు మరింతగా అర్థం చేసుకోవడమే కాక పరిశోధనలకు బాటలు వేస్తుందన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను పలువురు వీక్షించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందంరెడ్డి, శివప్ప, ప్రభావతి, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పలు వాహనాలకు ఢీ

చింతామణి, ఫిబ్రవరి 28: జాతీయ రహదారి 234పై ఎంజీ రోడ్డులో మద్యం మత్తులో కారును అడ్డదిడ్డంగా నడిపి పలు వాహనాలను ఢీ కొన్నాడు. మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటలకు చోటు చేసుకుంది. ఎంజీ రోడ్డులోని బార్‌లో మద్యం తాగిన కారు డ్రైవర్ హరీశ్, స్నేహితుడు శేఖర్‌లు కారును అడ్డదిడ్డంగా నడిపారు. ఆదర్శ థియేటర్ నుంచి ఆసుపత్రి వరకు రోడ్డుపక్కన ఆపిన 5 ద్విచక్రవాహనాలు, రోడ్డుపై వెళ్తున్న పలు వాహన దారులను ఢీ కొన్నారు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మురగమల్లా గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్, సయ్యద్ రఫీక్, మహ్మద్, జిలాన్‌పాషా, అబ్దుల్ సమద్, ఇమ్రాన్ పాషా సహా పలువురు గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఇమ్రాన్ పాషా, సల్మా దంపతులను మెరుగైన చికిత్సకోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు ఎట్టకేలకు హరీశ్, శేఖర్‌లను అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.

రావిచెట్టుకు నిప్పు



రావిచెట్టు ఇదే...

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 28: చందాపుర - ఆనేకల్ మా ర్గంలో ఇగ్గలూరు గ్రామ సమీపాన ఆంజనేయ స్వామి ఆలయ సమీపాన గల రావిచెట్టుకు కొందరు దుం డగులు నిప్పంటించారు. సుమా రు వంద సంవత్స రాలకుపైబడిన చెట్టుగా స్థానికుల ద్వారా తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం కొందరు దుండగులు చెట్టు కు నిప్పంటించారు. స్థానికుల ద్వారా తెలుసుకున్న అగ్ని మాపక దళ సిబ్బంది కార్యాచరణ చేపట్టింది. ఈ చెట్టు కు ఇటీవలికాలంలో నాలుగుసార్లు నిప్పంటించారని అగ్ని మాపక శాఖ అధికారి మహదేవ్ ఆరాధ్య తెలిపారు. కొన్ని గంటలపాటు నీరు చల్లడం ద్వారా మంటలను నియంత్రించారు.

నాగుపాము పట్టివేత

చింతామణి, ఫిబ్రవరి 28: పట్టణంలోని ఎంజీ రోడ్డు వెంకటగిరికోటె లే అవుట్‌లో ప్రభుత్వ పాఠశాల సమీపాన సుమారు ఆరున్నర అడుగుల పొడవైన నాగు పామును స్నేక్‌చౌడి, స్నేక్ అశోక్‌లు పట్టుకున్నారు. పట్టణంలో ఎక్కడ పాముల సంచారం ఉన్నా సమాచారం అందిస్తే చౌడి, అశోక్ లలో ఎవరో ఒకరు వచ్చి పట్టుకుని వాటిని తిరిగి అడవులలోకి వదిలేసేవారు. నాలుగేళ్లుగా 250కుపైగా పాములను పట్టుకున్నారు. పాము ఉందని సమాచారం ఇస్తే ఇద్దరిలో ఎవరో ఒకరు కర్ర, సంచి, ప్లాసిక్‌పైప్, ఇనుప కమ్మితో చేరుకుంటారు. పాములను ఎక్కడైనా గమనిస్తే స్నేక్ చౌడి 8310769851, స్నేక్ అశోక్ 831063400కు ఫోన్ చేయాలన్నారు.

పంటరుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోండి

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి28: మండలంలోని గొట్లూరు సొసైటీ బ్యాంకులో పంటరుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకు సీఈఓ నారాయణస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు మార్చినెల 30వ తేదిలోపు వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. బ్యాంకు రికార్డులన్నీ కం ప్యూటరీకరణ చేస్తున్నామని కావున రైతులందరూ తప్పకుండా వన్‌బీ, అడంగల్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు బ్యాంకులో అందజేయాలని సూచించారు.

వినికిడి సమస్యలకు నిర్లక్ష్యమే కారణం

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఏటా వినికిడి సమస్యలు ఎదుర్కొనేవారు పెరిగిపోతున్నారని నాయక్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ డైరెక్టర్ ఎంజేఎస్ నాయక్ అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ మార్చి 3న విశ్వవ్యాప్తంగా శ్రవణ దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు అవసర మని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం 150 కోట్ల మంది శ్రవణ సమస్యలు ఎదుర్కొంటున్నారని 2050నాటికి 250 కోట్లకు చేరనుందని విచారం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రవణ దినోత్సవాన్ని ప్రతి ఆసుపత్రిలోని వైద్యులు వినికిడి సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వినికిడి సమస్యలు తలెత్తినప్పుడు 80శాతం మంది సమగ్రమైన వైద్య సేవలు పొందడం లేదన్నారు. అదే తీవ్రమవుతోందన్నారు. చెవిటి సమస్యలతో భాష, నైపుణ్యత, విద్యా, మానసిక, ఆర్థిక అంశాలపైనా ప్రభావం చూపుతుందన్నారు. వినికిడి సమస్యలు వచ్చిన వెంటనే అందుబాటులో ఉండే నిపుణుల వద్దనే చికిత్సలు పొందాలన్నారు. సొంత వైద్యం చేసుకోరాదన్నారు. చెవిలో పుల్లలు పెట్టుకోవడం, భారీ శబ్దాలు వినడం ద్వారా కూడా సమస్యలు తలెత్తుతాయన్నారు. కాగా నెలలో ప్రతి మంగళవారం జేపీ నగర్ లోని క్లినిక్‌లో ఉచితంగా సేవలు అందిస్తామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీడియా సమావేశంలో పలువురు పాల్గొన్నారు.



మీడియాతో నిపుణులు ఎంజేఎస్ నాయక్ తదితరులు

ఆదాయంలో ప్రయాణాలకే 12.9 శాతం



అయ్యప్పనగర్‌లో సమావేశమైన అల్లిసేరోణా సభ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిన్నవ్యాపారాలు, ఉద్యోగాల ద్వారా జీవనం సాగిస్తున్న మహిళలు ఆదాయంలో ప్రయాణాల కోసమే 12.9 శాతం ఖర్చు చేస్తున్నారనే అంశమై అల్లి సేరోణా సంస్థ విచారం వ్యక్తం చేసింది. ఈమేరకు బుధవారం అయ్యప్పనగర్‌లో అల్లిసేరోణా సంస్థ ప్రతినిధుల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బెంగళూరు వ్యాప్తంగా ఇప్పటికీ అన్ని ప్రాంతాలకు బస్సు సదుపాయాలు లేవని ప్రతినిధులు తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సస్ ప్రొఫెసర్ అశిశ్‌వర్మా సర్వే వివరాలు ప్రస్తావించారు. ఉదాహరణకు ఇంటి నుంచి ఒకటి రెండు కిలోమీటర్‌ల మేరన నడిచి బస్టాప్‌కు చేరాల్సి ఉంటుందని అక్కడి నుంచి గమ్యంకు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో 149 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ ఉండే మార్గాలలో బస్సులు సక్రమంగా ఉండవని వరల్డ్ రీసోర్స్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయదింధా అభిప్రాయపడ్డారు. పేద వర్గాల ప్రజలు నగరీకరణ, వాతావరణం మార్పు వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వరన్నారు. ఫుట్‌పాత్‌లు, సైకిల్‌లైన్‌లు పెంచితే మరింత ఎక్కువ మందికి అనుకూలంగా ఉంటుందన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

బంగారపేట, ఫిబ్రవరి 28: ఢిల్లీలో జరుగుతున్న రైతు పోరాటంలో మృతి చెందినవారి కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులతో శాంతియుతంగా చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర రహదారి హంచాళ గేట్ వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అన్నదాతకు అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం రైతులపై పోలీసుల దౌర్జన్యం విచారకరమని రైతు సంఘం రాష్ట్ర నేత మరగల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్రం జారీ చేసిన వ్యవసాయ చట్టాలను ఏడాది పోరాటం ఫలితంగా రద్దు చేసినా రాష్ట్రప్రభుత్వం వాపసు తీసుకోలేదన్నారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ నివేదిక ప్రకారం మద్దతుధర, పింఛను తదితర న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించి అన్నదాతలకు అండగా నిలవాలన్నారు. వినతిని స్వీకరించిన ఉప తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. నిరసనలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణ గౌడ, తాలూకా అధ్యక్షుడు కదిరినత్త అప్పోజిరావ్, కిరణ్, చాంద్‌పాష, బాబాజాన్, మునికృష్ణ, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మహిళా స్వావలంబనపై జాగృతి



సామూహిక సీమంతంలో ఆశీర్వాదం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 28: జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ ఆధ్వర్యంలో తాలూకాలోని ఆనూరు గ్రామపంచాయతీలో మహిళా స్వావలంబనపై జాగృతి, మహిళలపై దౌర్జన్యాల నియంత్రణ అభియానను బుధవారం నిర్వహించారు. ఈఓ మునిరాజు ప్రారంభించి మాట్లాడుతూ స్త్రీ శిశుసంక్షేమశాఖకు కేటాయించిన గ్రాంట్లలో మహిళా స్వావలంబనపై తొలిసారి ఆనూరు గ్రామ పంచాయతీలో అభియాన నిర్వహించామన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావడమే ఉద్దేశ్యమన్నారు. జడ్పీ ముఖ్య ప్రాజెక్టు డైరెక్టర్ ధను రేణుక మాట్లాడుతూ ఆరోగ్య, గర్భధారణ అంశాలపై హింస, కుటుంబ హింస, దౌర్జన్యాలకు ఒకవేళ గురైతే వారికి అండగా ఉండేలా అభియాన దోహదపడుతుందన్నారు. అదే విధంగా మహిళలు తమ ఆరోగ్యంపట్ల దృష్టి సారించాలన్నారు. ఇదే సందర్భంగా పంచాయతీ పరిధిలోని గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఆనూరు పీడీఓ కాత్యాయిని, సీడీపీఓ నౌతాజ్, ఆనూరు గ్రామపంచాయతీ అధ్యక్షులు వెంకటేశ్, ఉపాధ్యక్షులు నేత్రావతి, ఆరోగ్యశాఖకు చెందిన మునిరత్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

చేళూరు, ఫిబ్రవరి 28: తాలూకాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండడంతో చెరువులన్నీ ఎండిపోతున్నాయని ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని పీడీఓ వెంకటాచలపతి పేర్కొన్నారు. తాలూకాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు గ్రామాలలోని చెరువులు ఎండిపోయాయని ఈ ఏడాది వేసవికి ముందే నీటికోసం హాహాకారాలు తప్పడం లేదన్నారు. పులగల్లు, గొట్లపల్లి, చాకవేలు తదితర చెరువులు ఎండిపోయాయి. తాగునీటికి పూర్తిగా బోరుబావులపైనే ఆధారపడ్డామన్నారు. కాగా పశువుల దాహార్తి తీర్చడానికి ప్రత్యేకంగా నీటితొట్టెలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. నీటి ఎద్దడి నేపథ్యంలో తాగునీటిని వృథా చేయరాదని ప్రజలను కోరారు.



ఎండిపోయిన పులగల్లు చెరువు

విధానసౌధలో పూలసోయగం



బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విధానసౌధలో పూలసోయగం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వేసవి సమయంలో మాత్రమే పూసే ఈ ప్రత్యేక రకాల పూలు విధానసౌధకు అదనపు ఆకర్షణగా మారాయి. ఈ సీజన్‌లో వచ్చే పుష్పాలతో పలువురు ఫొటోలు తీసుకుంటున్నారు. విధాన సౌధ అందాలను ఇనుమడిం ప చేస్తున్న ఈ పూలసోయగాన్ని 'ఆంధ్రజ్యోతి' బుధవారం క్లిక్ మనిపించింది.



2న ఘంటసాల శతజయంతి వేడుకలు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు ఘంటసాల శత జయంతి వేడుకలు నగరంలో మార్చి 2న సాయంత్రం 6 గంటలకు ఎడిఎ రంగ మందిరంలో జరుగనుంది. రంగమ్మ భీమప్ప శెట్టి లలితకళా ట్రస్టు, కళా ప్రదర్శిని సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మేరకు నిర్వ హకులు నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కేసీ రామమూర్తి పాల్గొంటారని నాట్య గురువులైన చిత్రా విశ్వేశ్వరన్, లలితా శ్రీనివాసన్, సంగీత దర్శకుడు హంసలేఖ, గాయని టీఎస్, సత్యవతిలకు ఇదే వేదికపై కళాప్రదర్శిని ఘంటసాల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఘంటసాల పాడిన అనేక కన్నడ తెలుగు మధుర గీతా లను పార్వతి రవి ఘంటసాల, వీణామూర్తి విజయ్, సత్యనారాయణ రాజు, వసం త కిరణ రాయసం, హరి, చేతన, పార్శ్వనాథ్ ఎస్.ఉపాధ్య, బదరి దివ్య భూషణ్, అనురాధ విశ్రాంత్, ఐశ్వర్య అనంత కార్తీక్, రంజితా వివిన్, అంజనా అనుప్ చంగ వళ్ళి, పవిత్రా శ్రీధర్, రమాప్రసాద్‌లు ఆలపించనున్నారని ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ దందా గుట్టు రట్టు

డాక్టర్ సహా ముగ్గురు విదేశీయుల అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ మాఫియాపై సీసీబీ పోలీసులు మెరుపుదాడులు జరిపారు. బెంగళూరులోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో నేత్ర వైద్యులైన డాక్టర్ నిఖిల్‌తోపాటు నైజీరియా దేశానికి చెందిన ముగ్గురిని మంగళ వారం అరెస్టు చేశారు. నైజీరియాకు చెందినవారిలో కాలు చుక్వా, చైనాస స్రుప్రిలాన్, ఘనాకు చెందిన ఇమ్మానియేల్ క్వాసిలను అరెస్టు చేశారు. ఆర్ఎంసీ యార్డ్ సమీపంలో నివసించే డాక్టర్ నిఖిల్‌ను తొలుత అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో సోలదేవనహళ్ళి, ఆర్ఎంసీయార్డ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో 730 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, 1273 ఎక్స్‌టసీ మాత్రలు, 42 గ్రాముల హైడ్రో గంజాతోపాటు నాలుగు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. వీటి విలువ రూ.2.35 కోట్లుగా ఉంటుందన్నారు. కొన్ని నెలలక్రితం పర్యాటకులుగా దేశంలోకి వచ్చిన నైజీరియన్‌లు బెంగళూరులో మకాం వేశారన్నారు. డ్రగ్స్ దందాలకు పాల్పడుతున్నారన్నారు. ముంబై పోలీసులు అరెస్టు చేసిన పెడ్లర్‌లకు సూత్రధారి ఒకోయిని అరెస్టు చేశాక వీరంతా బెంగళూరుకు వచ్చి సోలదేవనహళ్ళిలో తలదాచుకున్నారన్నారు. ఆర్ఎంసీ యార్డులో నివసించే నేత్ర వైద్యుడు డాక్టర్ నిఖిల్‌ను అరెస్టు చేసి విచారించామని నెదర్లాండ్స్ దేశం నుంచి హైడ్రో గంజాను కొరియర్ ద్వారా తెప్పించుకుని విక్రయించేవారన్నారు. పోస్టల్ ద్వారా వచ్చే పార్శిళ్ళపై నిఘా పెట్టామని ఇందులో తరచూ కంటి వైద్యుడికి కొరియర్‌లు వస్తుండడంతో అనుమానంతో దాడి చేయగా డ్రగ్స్ పట్టుబడ్డాయన్నారు. మూడేళ్లుగా అతను విదేశాలనుంచి డ్రగ్స్ తెప్పించుకుంటున్నట్టు గుర్తించామన్నారు.

కర్ణాటక పరిహారాన్ని తిరస్కరించిన కేరళ కుటుంబం

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ప్రకటించిన 15 లక్షల రూపాయల పరిహారాన్ని కేరళ రాష్ట్రం వయనాడ్ పడమళ నివాసి అజీశ్ కుటుంబం తిరస్కరించింది. కర్ణాటకలోని బేళూరు నుంచి కేరళవైపు వెళ్లిన అడవి ఏనుగు ఈనెల 10న అజీశ్‌పై దాడి చేయడంతో మృతి చెందాడు. అటవీశాఖ అమర్చిన రేడియో కాలర్ ఆధారంగా కుటుంబానికి రూ.15లక్షల పరిహారం ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమైంది. అజీశ్ కుటుంబాన్ని పరామర్శించిన తర్వాత సీఎం సిద్దరామయ్య, వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతో ఫోన్‌లో చర్చించాక పరిహారం ప్రకటించారు. కేరళలో ఏనుగు దాడిలో మృతి చెందితే కర్ణాటక నుంచి ఎందుకు పరిహారం ఇవ్వాలని, రాహుల్‌గాంధీ మెప్పుకోసమా అంటూ బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. శాసనసభలోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ మేరకు అజీశ్ కుటుంబం కర్ణాటక పరిహారాన్ని స్వీకరించేది లేదని తేల్చి చెప్పింది.

నదిలో ఈతకు వెళ్లి నలుగురు విద్యార్థుల దుర్మరణం

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదివే నలుగురు విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలు ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం ఈతకు వెళ్ళి దుర్మరణం చెందారు. దక్షిణకన్నడ జిల్లా సూరత్కల్‌కు చెందిన విద్యార్థులు యశ్విత్ చంద్రకాంత్, నిరూప్, అన్విత్, రాఘవేంద్రలు మృతి చెందినవారు. హళెయంగడి వద్ద నదిలోకి వీరు స్నానం చేసేందుకు వెళ్లారు. రాత్రి ఎంతసేపటికీ ఇళ్ళకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు గాలింపులు ఆరంభించారు. సూరత్కల్ విద్యాదాయిని పాఠశాలలో పరీక్షలలో పాల్గొన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఆ తర్వాత ఎక్కడికెళ్ళారనే కోణంలో తల్లిదండ్రులు, బంధువులు, పోలీసులు గాలింపులు ఆరంభించారు. బుధవారం హళియంగడి సమీపంలో నలుగురి మృత దేహాలను గుర్తించారు. ఈమేరకు సూరత్కల్ పోలీసులు మృతదేహాలను వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.

విద్వాన్ ఎస్ శంకర్‌కు సన్మానం



విద్వాన్ శంకర్‌తో ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని పొందిన విద్వాన్ ఎస్ శంకర్‌ను నగరంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ సన్మానించి అభినందించారు. చిక్‌పేట శాసనసభా నియోజకవర్గంలోని శంకరపురం నివాసిగా ఉన్న శంకర్‌కు జాతీయ స్థాయిలో పురస్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వివిపురం వార్డు నివాసుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, చిక్‌పేట మండల బీజేపీ నేతలు కవిరాజ్, మారిముత్తు తదితరులు ఉన్నారు.

అయోధ్యకు బయల్దేరిన భక్తులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 28: తాలూకా బీజేపీ తరఫున 48 మందికి పైగా రామ భక్తులు అయోధ్య రామ్‌లల్లా దర్శ నానికి బయల్దేరారు. ఈ సంద ర్భంగా రామభక్తుడు శ్రీకాంత్ మాట్లాడుతూ శిడ్లఘట్ట తాలూకాలోని రామ భక్తులకు అయోధ్యకు వెళ్లదలిచినవారికి భారతీయ జనతాపార్టీ అవ కాశం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీకల్ ఆనంద్‌గౌడ భక్తులకు కాషాయ కండువాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంచాలకుడు కేఎస్ కనకప్రసాద్, దిశా వెంకటేశ్, యువ మోర్చా పట్టణ విభాగం అధ్యక్షుడు భరత్‌కుమార్, వినాయక గ్యాస్ భారత్, జగదీశ్, సాయిబాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు వద్ద భక్తుల బృందం